

క్షయ నిర్మూలనపై అవగాహన


సదస్సులో పాల్గొన్న వైద్యసిబ్బంది

ప్రజాశక్తి-నల్లజర్ల

క్షయ వ్యాధి నిర్మూలనపై అవగాహనా సదస్సు పోతవరంపిహెచ్‌సిలో మంగళవారం జరిగింది. టిబి సీనియర్ ట్రీట్మెంట్ సూపర్ వైజర్ ఆశా జ్యోతి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎం లకు టి బి వ్యాధి లక్షణాలు, నివారణ పై అవగాహన కల్పించారు. హెచ్‌ఐవీ వ్యాధిగ్రస్తులు, డయాబెటిస్ వ్యాధిగ్రస్తులు, గర్భిణులకు క్షయ వ్యాధి లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికి నిర్ధారణ పరీక్షలు తప్పనిసరిగా చేయించాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధికారి డాక్టర్ వెంకట్రావు, పిహెచ్‌ఎన్ కె.ఇందిర, ఎంపిహెచ్ఇఒ పలివెల సత్యం, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిరుపయోగంగా లాకు క్వార్టర్లు

నిరుపయోగంగా నూతన నివాస గృహాలు

మట్టిపాలవుతున్న ఇరిగేషన్ ఇనుము , పాత కలప

ప్రజాశక్తి-కడియం

కడియం లాకులు సమస్యలకు నిలయంగా మారాయి. కడియం లాకుల పరిధిలో పూర్వపు సిబ్బంది నివాసగృహాలు శిథిలావస్థకు చేరడంతో వాటిని ఆనుకుని 2012 సంవత్సరంలో నివాస గృహాలు నిర్మించారు. కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడింది అన్న చందంగా అసలు సమస్య మొదలయ్యింది. అప్పటివరకూ శిథిలావస్థకు చేరిన ఇండ్లలో కనీస సౌకర్యాలు లేనప్పటికీ వాటిలోనే ఉంటూ విధులు సిబ్బంది విధులు నిర్వహించేవారు. నూతనంగా నిర్మించిన ఇళ్లల్లో మౌలిక వసతులు లేవంటూ కుంటిసాకులు చెబుతూ, దూరప్రాంతాల నుంచి వస్తున్నారని వేళాపాలా లేకుండా విధులు నిర్వహిస్తున్నారని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు.

ఎండకు ఎండుతూ.. వర్షానికి తడుస్తున్న పాత ఇనుము

లాకుల ఆవరణలో ఇరిగేషన్ శాఖకు చెందిన వివిధ రకాల విలువైన పాత ఇనుప సామగ్రి, పాత కలప ఏళ్ల తరబడి ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పుపట్టి, పాడై మట్టిలో కలిసపోతుంది. అయినా సంబంధిత అధికారులు కనీసం స్పందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వానికి సంబంధించి ఏ శాఖలోని వస్తువైనా నిరుపయోగంగా మారితే మరలా మరమ్మతులు చేపట్టి, వినియోగంలోనికి తీసుకురావడం లేదా వాటిని భద్రపరిచి సంబంధిత శాఖ ద్వారా వేలం నిర్వహించి, దాని ద్వారా వచ్చిన సొమ్ము లను ఆ శాఖ అధికారులు ప్రభుత్వ ఖజానాకు జమ చేయాల్సి ఉంటుంది. కానీ అవేమి ఇక్కడ కానరావడం లేదు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి విలువైన సామగ్రిని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.


నిరుపయోగంగా ఉన్న నూతనంగా నిర్మించిన గృహాలు

ఏడాదిపొడవునా ఏదో పంట

కడియం లాకుల పరిధిలో గల కొంత ఖాళీభూమిలో గత కొన్నేళ్లుగా సంవత్సరం పొడవునా ఏదో ఒక పంట సాగు చేస్తున్నారు. ముఖ్యంగా సమీప గ్రామమైన కడియపుసావరం గ్రామానికి చెందిన రైతులు పూలసాగు, కూరగాయలు పెంపకం చేస్తున్నారని , ఇందు నిమిత్తం లాకు సిబ్బందికి కొంతమొత్తం నగదు అందజేస్తున్నారని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. దమ్మిడీ ఆదాయం లేదని, కరెంటు బిల్లులు కూడా తమ జేబులోని డబ్బులు తీసి చెల్లిస్తున్నామని లాకు సూపరింటెండెంట్ చెబుతున్నారు. మరి ఎవరి మాటల్లో నిజముందో, ఎంత నిజాయితీ ఉందో ఉన్నతాధికారులు నిగ్గుతేలాల్సివుంది?

నూతనంగా నిర్మించిన ఇళ్లు అప్పగించలేదు

ఇరిగేషన్ డిఇఇ , ఎఇఇ లను వివరణ కోరగా నూతనంగా నిర్మించిన ఇళ్లు ఇప్పటివరకూ (నిర్మాణదారులు,గుత్తేదారులు,ఏజెన్సీల) వారు తమకు అప్పగించలేదన్నారు. ఇళ్లలో నివాసాలు ఉండాలంటే లాకులకు సంబంధించిన శాశ్వత ఉద్యోగులు ఉండాలని, కానీ ప్రస్తుతం ఒక్క లాకు సూపరింటెండెంట్ మాత్రమే శాశ్వత ఉద్యోగిగా విధులు నిర్వహిస్తున్నారని, మిగతా వారంతా ఔట్ సోర్సింగ్ ఉద్యోగులేనన్నారు. పాత ఇనుము,కలపకు సంబంధించిన వేలంవేసేవెసులుబాటుతమకు లేదన్నారు.




పాత కలప, తప్పుపడుతున్న పాత ఇనుము


లాకుల పరిధిలో ఉన్న ఖాళీ భూమిలో సాగవుతున్న పంట

విద్యావ్యవస్థలో అధునాతన మార్పులు


విద్యార్థులతో డిజిటల్ క్లాసులు వీక్షిస్తున్న ఎంఎల్ఎ

ప్రజాశక్తి -ఉండ్రాజవరం

విద్యా వ్యవస్థలో తీసుకొస్తున్న అధునాతన మార్పుల ద్వారా సిఎం జగన్‌కు విద్యార్థుల పట్ల ఉన్న నిబద్ధత తెలియజేస్తుందన్నారు నిడదవోలు ఎంఎల్ఎ జి.శ్రీనివాస్ నాయుడు. మంగళవారం తొలుత మండల కేంద్రం ఉండ్రాజవరంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో అమ్మ ఒడి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిజిటల్ బోర్డ్ (ఐఎఫ్‌పి) ఆవిష్కరించి, విద్యార్థులతో పాటు కూర్చుని ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ బోర్డు ద్వారా పాఠాలను వీక్షించారు. అనంతరం వడ్లూరు లో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ప్రారంభించి, జల జీవన్ మిషన్ కు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమాలలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, మండల ప్రత్యేక అధికారి బి.బాల స్వామి, ఎంపిపి పాలాటి యల్లారీశ్వరి శరత్, జెడ్‌పిటిసి సభ్యుడు నందిగం భాస్కర రామయ్య, వడ్లూరు కతారి సిద్ధార్థ రాజు, సర్పంచ్ మెండే వెంకటరావు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, వివిధ శాఖల మండల అధికారులు, ప్రధానోపాధ్యాయులు వారణాసి విశ్వప్రసాద్, విద్యార్థుల తల్లి తండ్రులు తదితరులు పాల్గొన్నారు.

120 మందికి కంటి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-ఉండ్రాజవరం

తాడిపర్రు పిహెచ్‌సిలో మంగళవారం జగనన్న కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా సుమారు 120 మందికి పరీక్షలు నిర్వహించారు. తాడిపర్రు సర్పంచ్ కరుటూరి నరేంద్రబాబు జగనన్న కంటి వెలుగు నేత్ర వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామ ప్రజలకు కంటికి సంబంధించిన సమస్యలు ఉంటే జగనన్న కంటి వెలుగు ద్వారా పరిష్కరించుకోవచ్చనని అన్నారు. ప్రభుత్వ వైద్యులు ఇంటిముందుకే వచ్చి వైద్య శిబిరాలు నిర్వహించడం వల్ల పేద ప్రజలకు ఆర్థిక భారం లేకుండా సరైన వైద్యం గ్రామంలోని దొరుకుతుందని అన్నారు. ఈ శిబిరంలో 120 మందికి కంటి పరీక్షలు చేశారు. వైద్య పరీక్షల అనంతరం అవసర మైన వారికి కళ్లజోళ్ళు, మందులు పంపిణీ చేసినట్లు పిహెచ్‌సి వైద్యాధికారి ఆర్.ప్రసాద్ తెలిపారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పోలవరపు సత్యనారాయణ, అధికారులు టి.రాంబాబు, సిహెచ్ చక్రవర్తి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

9న రోటరీ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం


కీర్తి.ఆంజనేయులు

ప్రజాశక్తి-నిడదవోలు

నిడదవోలు రోటరీ క్లబ్ (2023-24) అధ్యక్షునిగా కీర్తి ఆంజనేయులు, కార్యదర్శి గుంటుపల్లి వెంకట నాగ శివ కుమార్, కోశాధికారిగా కాళ్ళ రాంబాబు ఇటీవల ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మం గళవారం మాట్లాడుతూ ఈ నెల 9న డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్ట్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు, ఇన్‌స్టాలేషన్ ఆఫీసర్‌గా ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి హాజరవు తున్నారని అన్నారు. ప్రత్యేక అతిథిగా డిస్టిక్ గవర్నర్ పోలదాసు శ్రీనివాసరావు, ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ శ్రీనివాస్ నాయుడు, ప్రత్యేక అతిథిగా మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ హాజరవుతారని సభ్యులు ఆహ్వానితులు పాల్గొని కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.


కేక్ కట్ చేస్తున్న దృశ్యం

ఘనంగా వంగవీటి జయంతి

ప్రజాశక్తి-గోపాలపురం


వంగవీటి మోహన్ రంగ జయంతిని కొవ్వూరుపాడులో నిర్వహించారు. సర్పంచ్ చిలక లక్ష్మణస్వామి, ఎంపిటిసి సభ్యుడు ఎడ్లపల్లి సూరిబాబు, గ్రామ పెద్దలు పాల్గొని రంగా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఇంటర్ ఫలితాల్లో గ్రామానికి చెందిన పసుపులేటి స్వాతి 979, ప్రగడ శిరీష 956, టెన్త్‌లో సిరిపల్లి హాసిని 539 మార్కులు సాధించడం పట్ల గ్రామం తరపున వారిని సత్కరించారు. అనంతరం భారీ కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వేగువాడ నాగేశ్వరరావు, ప్రగడ రాంబాబు, చిలక వెంకన్న, దగ్గు వెంకటేష్, వంగవీటి యూత్ పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో ఉచిత వైద్యసేవలు

ప్రజాశక్తి -గోపాలపురం

ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ద్వారా అందిస్తున్న ఉచిత వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ నవీన్ తెలిపారు. మంగళవారం గోపాలపురంలోని ఉప్పరగూడెం గ్రామంలో అంగన్‌వాడీ స్కూల్ వద్ద ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 104 వాహనం ద్వారా వెళ్లి 75 మందుకి వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో 104 వాహన సిబ్బంది, ఏఎన్‌ఎం లు, ఆశాల పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



ఎన్నికలప్పుడు... ఫ్రీగా ఇచ్చి అలవాటు చేసి.. ఆ తర్వాత ఐదేళ్లూ మన డబ్బంతా పిండేశారు గదరా...!!!!

సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష

ప్రజాశక్తి-యంత్రాంగం

ప్రజా సమస్యల పరిష్కారానికే జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వైసిపి ప్రభుత్వం నిర్వహిస్తోందని ప్రజాప్రతినిధులు అన్నారు. వివరాలుఇవి..

తాళ్లపూడి ప్రజలకు అవసరమైన సేవలు సర్టిఫికెట్లు అందించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న సురక్ష పథకం సక్రమంగా నిర్వహించే బాధ్యత వాలంటీర్లు సచివాలయ సిబ్బంది దేనని హోం శాఖ మంత్రి డాక్టర్ తానేటి వనిత అన్నారు. మండలంలోని వేగేశ్వరపురం పోచవరం గ్రామాలలో మంగళవారం జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమానికి మంత్రి వనిత హాజరయ్యారు.. వేగేశ్వరపురం గ్రామంలో ప్రజలకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. మంత్రి మాట్లాడుతూ గ్రామానికి రూ.40 లక్షల రూపాయల ఖర్చుతో విద్యుత్ అభివద్ధి పనులు చేపట్టామన్నారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు రైతులు మాట్లాడుతూ ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి దష్టికి తీసుకువచ్చారు. గ్రామ కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ సురక్ష పథకం కింద 519 సమస్యలకి పరిష్కారం చూపుతూ ధ్రువీకరణ పత్రాలు అందజేయనన్నట్లు తెలిపారు. పోచవరం గ్రామంలో మంత్రి మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం ఆవశ్యకతను ప్రజలకు వివరిస్తూ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. జగనన్న సురక్ష పథకంలో పాల్గొనేందుకు మండలానికి వచ్చిన మంత్రి వనితకు మండల వైసిపి నాయకులు ఘన స్వాగతం పలకగా ఆయా గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎంపిపి జొన్నకూటి పోసిరాజు, జెడ్‌పి వైస్ చైర్పర్సన్ పోసిన శ్రీలేఖ, సర్పంచ్ కొమ్మిరెడ్డి పరశురామారావు, తదితరులు పాల్గొన్నారు. **కడియం** కడియం మండలం దుళ్ల, మురమండ గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ గ్రామాల్లో కార్యక్రమాలకు అధ్యక్షత వహించిన ఎంపిడిఒ రత్నకుమారి, తహశీల్దార్ సుజాతలు మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరికి అవసరమైన అన్ని ధ్రువపత్రాలు ఉండాలనే సంకల్పంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ కార్యక్రమాన్ని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పాల్గొన్న మండల జెసిఎస్ కన్వీనర్ తాడాల చక్రవర్తి మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కి అందరూ అండ గా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తోకల శ్రీనివాస్, ఎంపిటిసి సభ్యులు కట్టుంగ నాగరాజు, బసవ శంకరం, వార్డు సభ్యులు, కన్వీనర్లు పాల్గొన్నారు. **చాగల్లు** మల్లవరం మరియు యస్.ముప్పవరం గ్రామ సచివాలయాల్లో జగనన్న సురక్ష క్యాంపు నిర్వహించారు. మల్లవరం సచివాలయములో 843 మరియు యస్.ముప్పవరం లో 365 సర్టిఫికెట్స్ అధికారులు మరియు గ్రామ సర్పంచులు ప్రజా ప్రతినిధులు చేతుల మీదుగా లబ్ధిదారులకి అందచేసారు. అధికారులు, ప్రజాప్రతనిధులు పాల్గొన్నారు. గో**పాలపురం** మండలంలోని గుడ్డిగూడెం, దొండపూడి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం సర్పంచులు మడి చర్ల ప్రసాద్, మల్లిపూడి అచ్చిబాబు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంఎల్ఎ తలారి వెంకట్రావు విచ్చేసి మాట్లాడారు. నియోజకవర్గంలో రూ.300 కోట్లు పెట్టి రోడ్లు అభివృద్ధి చేస్తామని అన్నారు. మిగిలి ఉన్న రోడ్లను కూడా త్వరలో పూర్తి చేస్తామని అన్నారు. రెండు గ్రామాలకు సంబంధించి 1217 సర్టిఫికెట్లను అందించారు. రెండు గ్రామాలలో ప్రజా సమస్యలు ఎంఎల్ఎ దృష్టికి తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు ఆర్‌డిఒ మల్లి బాబు, రాష్ట్ర అత్తిరాస కార్పొరేషన్ ఛైర్మన్ ఇళ్ల భాస్కరరావు, ఎఎంసి ఛైర్మన్ జనార్ధన్‌రావు, ఎంపిపి ఉండవల్లి సత్యనారాయణ, మండల స్పెషల్ ఆఫీసర్ సత్య గోవింద్, జెడ్‌పిటిసి సభ్యురాలు కె.లలిత, ఎంపిడిఒ ఆర్.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు. **గోకవరం** మండలంలోని కామరాజుపేటలో జగననన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు పాల్గొన్నారు.


వేగేశ్వరపురంలో ధ్రువ పత్రాలు అందజేస్తున్న మంత్రి వనిత


గుడ్డిగూడెంలో ధ్రువపత్రాలుఅందజేస్తున్న ఎంఎల్ఎ తలారి వెంకట్రావు

అర్హులందరికీ ధ్రువపత్రాలు జారీ చేయాలి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

జగనన్న సురక్ష క్యాంపుల ద్వారా అర్హులైన అందరికి ధవపత్రాలు అందచేయాలని రాజమహేంద్రవరం కమిషనరు కె.దినేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం క్యాంపులు నిర్వహిస్తునటువంటి 9 నుంచి 11 దేవాంగ కమ్యూనిటీ హాలులోని సచివాలయాలను, 12 నుంచి 15 ప్రకాష్ నగర్ ప్రాంతములో సచివాలయాలను మరియు 16 నుంచి 19 విద్యుత్ కాలనీలో సచివాలయములను సందర్శించారు. ఈ సందర్భముగా కమిషనర్ మాట్లాడుతూ మొత్తం యంత్రాంగము ప్రతి ఇంటిని సందర్శించి అర్హులైన అందరిని గుర్తించి వారికి అవసరమైన ధ్రువపత్రాలు అందచేసి వారికి లబ్ధి చేకూరేలా చేసే కార్యక్రమం అని, ప్రజలందరూ వాలంటీర్ల ద్వారా జరుగుతున్న సర్వేలో పాల్గొనాలని, వారికి అవసరమైన పత్రాలు ఉచితంగా పొందాలని పిలుపునిచ్చారు. క్యాంపు నిర్వహణకై పలు సూచనలు చేశారు. క్యాంపుని సందర్శించే వారికి బిస్కట్ ప్యాకెట్లు అందచేయాలని, అలాగే మంచినీరు అందించాలని హెల్త్ క్యాంపు నిర్వహించాలని ఆదేశించారు. లబ్ధిదారుల సౌకర్యార్థం హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని, రిజిస్ట్రేషన్ కౌంటరు, వెరిఫికేషన్ కౌంటరు, సర్వీస్ రిక్వెస్ట్ ప్రకారము పత్రములు అందచేసి కౌంటర్లతో పాటు స్పందన / జగనన్నకు చెబుతాం కౌంటర్లు కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనరు పిఎం సత్యవేణి, అర్బన్ తహశీల్దారు వి.సుస్వాగతం, డిప్యూటీ కమిషనరు జి.సాంబశివరావు, రెవెన్యూ ఆఫీసర్లు సిహెచ్.శ్రీనివాసరావు, కెబిఆర్.రవికుమార్, ఇతర సిబ్బంది మరియు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. మంగళవారం స్థానిక హుకుంపేట గ్రామంలో జగనన్న సురక్ష గ్రామ సభలోరూరల్ కో ఆర్డినేటర్ చందన నాగేశ్వర్ , మండల ప్రత్యేక అధికారి కెయస్.జ్యోతి, ఇతర ప్రజా ప్రతినిధులతో కలిసి కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, సచివాలయ వ్యవస్థ తీసుకుని రావడం, ప్రతి 50 నుంచి 100 ఇళ్లకు ఒక వాలంటీర్ ను నియమించి మీ సమస్యల పరిష్కారం కోసం మీ గ్రామంలోనే చర్యలు తీసుకోవడం జరుగుతోందని అన్నారు.


ధ్రువపత్రాలుఅందజేస్తున్న రాజమహేంద్రవరం కమిషనర్ దినేష్‌కుమార్

మన్యం వీరుడు అల్లూరికి ఘన నివాళి

ప్రజాశక్తి-యంత్రాంగం

జిల్లాలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం స్థానిక పివి నరసింహారావు పార్కు (గోదావరి బండ్) ఆవరణలో అల్లూరి సీతారామరాజు విగ్రహాని డాక్టర్ కె.మాధవీలత తదితరులు పూలమాలలువేసినివాళులర్పించారు. అల్లూరి సీతారామరాజు చదువుకున్న ఉల్లితోట బంగారయ్య మున్సిపల్ స్కూలులో ఒక బ్లాక్ కు అల్లూరి పేరు పెడుతున్నట్లు కలెక్టర్ డాక్టర్‌కె.మాధవీలత అన్నారు. గోదావరి గట్టున జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం ఏర్పాటు చేసిన అల్లూరి విగ్రహం వద్ద జరిగిన అల్లూరి సీతారామరాజు వ జయంతి ముగింపు ఉత్సవంలో జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. స్థానిక గోరక్షణపేట జంక్షన్లో ఉన్న స్వాతంత్ర్య సమరయోధుడు పడాల రామారావు స్మారక స్థూపం వద్ద ఉన్న అల్లూరి విగ్రహం వద్ద జయంతి ముగింపు ఉత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ అల్లూరి సీతారామరాజు యువజన సంఘం కార్యదర్శి చీకట్ల శివన్నారాయణ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. **చాగల్లు** మండలంలో చాగల్లు శాఖ గ్రంథాలయంలో మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి నిర్వహించారు. **గోకవరం** ఎలక్ట్రికల్ యూనియన్ ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతి నిర్వహించారు. జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు, వైసిపి ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం కో ఆర్డినేటర్ జగ్గంపూడి గణేష్ తదితరులు పాల్గొన్నారు. **గోపాలపురం** అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఎంఎల్ఎ తలారి వెంకట్రావు తదితరులు అల్లూరి చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. **ఉండ్రాజవరం** వడ్లూరు, వెలగదుర్రు గ్రామాల్లో అల్లూరి సీతారామరాజు జయంతిని నిర్వహించారు. **సీతానగరం** అల్లూరి సీతారామరాజు జయంతిని సిపిఐ (ఎంఎల్) రాష్ట్ర కమిటీ సభ్యులు పలివెల వీరబాబు ఆధ్వర్యంలో నిర్వహించారు. నాలుగు బొమ్మలు కూడలిలో మరియు మండల కేంద్రంలో, చినకొండేపూడి గ్రామంలో ఉన్న అలూ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళలర్పించారు. **నల్లజర్ల** దూబచర్ల గ్రామంలో అల్లూరి సీతారామరాజు జయంతిని లయన్స్ క్లబ్స్ దూబచర్ల ఆధ్వర్యంలో ఆజాది కా అమత మహోత్సవం లో భాగంగా సంఘమిత్ర విద్యాలయ నందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మన్యంలో 35 సంవత్సరాలుగా విద్యా సేవలు అందించిన పులలపాడు గ్రామానికి చెందిన అల్లూరి రామచంద్రరావు మాస్టారుని సత్కరించారు **తాళ్లపూడి** అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా పాఠశాలలో అల్లూరితోపాటు భారతీయ తత్వవేత్త స్వామి వివేకానంద, జాతీయ పతాకం నిర్మాత పింగళి వెంకయ్య చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు.


అల్లూరి విగ్రహం వద్ద నివాళులుఅర్పిస్తున్న కలెక్టర్ మాధవీలత

30 రోజుల పాటు ఫొటోగ్రఫీలో శిక్షణ


శ్రీనివాసరావు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

ఫొటోగ్రఫీ మరియు వీడియోగ్రఫీలో స్థానిక ఆల్కట్ గార్డెన్స్ నందు ఉన్న యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ నందు 30 రోజులపాటు ఉచిత శిక్షణను అందిస్తున్నామనిసంస్థ డైరెక్టర్ తాడి.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. శిక్షణ సమయంలో ఉచిత భోజనం వసతి కల్పిస్తామన్నారు. ఈ శిక్షణ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అభ్యర్థులకు మాత్రమేనని, 18 సంవత్సరాల నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగి, తెల్ల రేషన్ కార్డ్ ఉండాలని కనీసం 8వ తరగతి చదివి ఉండాలని వివరాలకు దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లకు96668 32144, 0883 2420242, 2428807 నంబర్లకు ఫోన్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు.



పోలీసులతో మానవతా సేవా సంస్థ సభ్యులు

ప్రమాదాల నివారణకు హెచ్చరిక బోర్డులు

ప్రజాశక్తి-దేవరపల్లి

దేవరపల్లి మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ వారి కోరిక మేరకు నాలుగు ప్రమాద నివారణ హెచ్చరిక బోర్డులు అందజేశారు. ఆ బోర్డులను దేవరపల్లి సిఐ అనసూరి శ్రీనివాసరావు, ఎస్ఐ ఎ.శ్రీహరి రావు ప్రారంభించారు. సిఐ మాట్లాడుతూవారు అడిగిన వెంటనే బోర్డులను ఏర్పాటు చేసిన దేవరపల్లి మండల మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కమిటీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ బోర్డులు డైమండ్ సర్కిల్ నాలుగు వైపులా ఏర్పాటు చేశారు. ఈ నాలుగు బోర్డులు మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు కేశిరాజు సీతారామయ్య, యువరాణి జ్యువెలర్స్, పుప్పాల నాగలక్ష్మి వార్ల ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మండల శాఖ అధ్యక్షులు బండి సూర్య ప్రకాశ రావు, కార్యదర్శి ఈడుపుగంటి నాగేశ్వరరావు, కోశాధికారి తీగల లక్ష్మీనారాయణ, కన్వీనర్ కేశిరాజు రాజకుమార్, కేశిరాజు సీతారామయ్య నారాయణ విశ్వేశ్వరరావు, ఛైర్మన్ బలుసు సత్యనారాయణ, కో ఛైర్మన్ పప్పు వెంకట రామారావు మరియు ఆచంట రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఏడుగురు జూదరుల అరెస్టు

ప్రజాశక్తి - మామిడికుదురు

పాశర్లపూడిలో అమ్మ సూపర్ మార్కెట్ వెనుక గొడౌన్‌లో పేకాట ఆడుతున్న ఏడుగురు జూదరులను మంగళవారం అరెస్టు చేశామని ఎస్ఐ ఎస్‌కె.జానీభాషా తెలిపారు. వారి నుంచి రూ.12 వేల నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. జూదాలు నిర్వహించినా, ఆడినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదు

ప్రజాశక్తి -మండపేట

తనను చంపేస్తానంటూ బెదిరింపులకు దిగారంటూ స్థానిక మఠం వీధిలో నివశిస్తున్న కె.సీతారాంమోహనరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ కోన అప్పారావు తెలిపారు. సీతారాంమోహనరావు కుమార్తె చెల్లూరి కుమారిధనలక్ష్మికి వివాహం చేశాడు. ధనలక్ష్మి భర్తతో వరకట్నం కోసం వేధించడంతో కుమారునితో కలిసి తండ్రి వద్ద ఉంటోంది. గత నెల 30న చెల్లూరి వీరేంద్రకుమార్, సురేంద్ర కలిసి సీతారాంమోహనరావు ఇంటికి వచ్చారు. తలుపులు బాది బూతులు తిట్టి చంపేస్తానని బెదిరించారు. దీంతో రావు భయంతో కేకలు వేశారు. చుట్టుపక్కలవారు వచ్చేసరికి పారిపోయారు. దీనిపై ఆయన పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రూ.6.50 లక్షల సొత్తు చోరీ

ప్రజాశక్తి-మండపేట

స్థానిక శెట్టి బలిజ కళ్యాణమండపం సమీపంలోని ఆళ్లూరు మునిలక్ష్మి నారాయణ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు రూ.6.5 లక్షల విలువైన సొత్తును చోరీ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు లక్ష్మీ నారాయణ ఇంటివద్ద బట్టల వ్యాపారం చేస్తూ జీవిస్తున్నారు. ఈ నెల ఒకటవ తేదీన తన బావమరిది ఉద్యోగ విరమణ కార్యక్రమం కోసం హైదరాబాదుకు వెళ్లారు. ఇంటి పక్కనే వుంటున్న నారాయణ సోదరుడు గురునాథం ఈ నెల 3న ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయని ఫోనులో సమాచారం ఇచ్చాడు. నారాయణ ఈ నెల 4న ఉదయం వచ్చి చూడగా ఇంట్లో వస్తువులన్నీ చిందరవందరగా పడి ఉన్నాయి. బీరువాలో రూ.70 వేల నగదు, రూ.5.82 లక్షల విలువ చేసే బంగారం, వెండి వస్తువులు అపహరణకు గురైనట్లు గుర్తించాడు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మహిళ అదృశ్యంపై కేసు

ప్రజాశక్తి - అమలాపురం రూరల్



అమలాపురం రూరల్ మండలం తాండవపల్లికి చెందిన గుత్తుల పద్మ(42) అదృశ్యమైనట్టు నాగజమున ఫిర్యాదు మేరకు అమలాపురం తాలూకా పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. ఆమె సుమారు 5 అడుగుల 3అంగుళాలు పొడవు, చామన చాయలో ఉంటుందన్నారు. అదృశ్యమైన సమయంలో పసుపు రంగు చీరను కట్టుకుందని తెలిపారు. పద్మ ఆచూకీ ఎవరికైనా తెలిస్తే 9440796562, 9440796525 నెంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు తెలిపారు.



ధ్రువీకరణ పత్రాలు ఇస్తున్న ఎంపిపి సునీత తదితరులు

జగనన్న సురక్షను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - కాట్రేనికోన

జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా 11 రకాల ఉచిత సేవలు అందుతాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపిపి రాయుడు సునీత అన్నారు. మంగళవారం ఐంజరంలో సర్పంచ్ ముద్దన వెంకట శివరాం ప్రసాద్ అధ్యక్షత జగనన్న సురక్ష సభను నిర్వహించారు. ఎంపిపి ముఖ్యఅతిథిగా హాజరై 426 మందికి మంజూరైన ధ్రువీకరణ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల ప్రధాన కార్యదర్శి రాయుడు గంగాధర్, ప్రత్యేక అధికారి లక్ష్మీనరసయ్య, దున్న శ్రీకాంత్, ఎంపిటిసి సభ్యులు కె.శేఖర్‌కుమార్, పెయ్యల కొండబాబు, మల్లేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు సుధారాణి, ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో సత్వర పరిష్కారం

ప్రజాశక్తి - కాకినాడరూరల్

వివిధ కోర్టు కేసులకు లోక్ అదాలత్‌లో సత్వర పరిష్కారం దొరుకుతుందని న్యాయవాది రవిశంకర్ పట్నాయక్ పేర్కొన్నారు. సర్పవరం జంక్షన్‌లో బోట్ క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సు ఉద్దేశించి ఆయన మాట్లాడారు. చిన్నచిన్న సమస్యలతో కోర్టుల చుట్టూ ఏళ్ల తరబడి తిరిగి విలువైన సమయాన్ని, ధనాన్ని ఖర్చులను వెచ్చిస్తున్నారన్నారు. ఇరు పార్టీలను నొప్పించకుండా తీర్పు వెలువరించే ఒక మహత్తరమైన ప్రక్రియ లోక్ అదాలత్ అన్నారు. ఈ నెల 22న జరుగనున్న ప్రత్యేక లోక్ అదాలత్ ను సద్వినియోగం చేసుకోవాలని పట్నాయక్ తెలిపారు. అధ్యక్షుడు దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో స్థానికులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో చూడి గేదె మృత్యువాత

ప్రజాశక్తి - గండేపల్లి

ఉప్పలపాడు గ్రామ సరిహద్దుల్లో హైవే పక్కన విద్యుదాఘాతానికి గురై చూడి గేదె మృత్యువాత పడింది. ఉప్పలపాడుకు చెందిన ఐనకోటి స్వామి గేదెలను మేపుకొని జీవనం సాగిస్తున్నాడు. ఎప్పటిలానే మంగళవారం ఉదయం హైవే పక్కన ఉన్న ఖాళీ ప్రదేశానికి మేతకోసం తీసుకెళ్లాడు. మెయిన్ బాక్స్ కరెంటు స్తంభం ఉన్న ప్రదేశంలో మేతకు మేస్తుండగా తీగ విద్యుదాఘాతానికి గురై చనిపోయింది. ఈ గేదె విలువ రూ.90 వేలు ఉంటుందని తెలిపారు. వెటర్నరీ డాక్టర్ సుప్రియ, ఎలక్ట్రికల్ ఎఇ సునీత ఘటనా స్థలాన్ని పరిశీలించారు. తనకు న్యాయం చేయాలని రైతు వారిని వేడుకున్నాడు.

యానాం వార్తలు



కాలువను పరిశీలిస్తున్న ఆర్ఎఒ

ఫ్రెంచ్ లింకింగ్ ఛానల్ పరిశీలన

నల్ల చెరువు తదితర మంచినీటి చెరువుల్లో పూర్తిస్థాయిలో నీరు లేకపోవడంతో మంగళవారం ఆర్ఎఒ మునిస్వామి పిల్లలంకలో ఉన్న ఫ్రెంచ్ లింకింగ్ ఛానల్‌ను పరిశీలించారు. నీటి ఎద్దడి తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని పిడబ్ల్యుడి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఇఇ వీర సెల్వం, జెఇ యాళ్ల వీరాస్వామి, జ్యోతిరాజు పాల్గొన్నారు.



అల్లూరి జయంతిలో పాల్గొన్న ఆర్ఎఒ, ఇతర అధికారులు, యువకులు

ఘనంగా అల్లూరి జయంతి

అల్లూరి సీతారామరాజు జయంతిని, వివేకానంద, పింగళి వెంకయ్య వర్ధంతిని సమాచార శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఫెర్రీ రోడ్‌లో ఉన్న వారి విగ్రహాలకు ప్రాంతీయ పరిపాలనాధికారి ఆర్ మునిస్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌ఛార్జి కమిషనర్ ఖండవల్లి రామకృష్ణ, సివ షణ్ముగం, ఎస్ఐ నూకరాజు, దట్ల దేవదానం రాజు తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎంపి వంగా గీత

అంగన్‌వాడీల సేవలను ఎనలేనివి

ప్రజాశక్తి - జగ్గంపేట

అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సేవలను ఎనలేనివని ఎంపి వంగా గీత అన్నారు. జగ్గంపేట ఐసిడిఎస్ కార్యాలయం ప్రారంభోత్సవంలో ఆమె పాల్గొన్నారు. సిడిపిఒ పూర్ణిమ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపీ మాట్లాడుతూ అంగన్‌వాడీ సేవలను అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. జగ్గంపేట ఎంఎల్ఎ జ్యోతుల చంటిబాబు మాట్లాడుతూ జిల్లాల విభజనకు ముందు అంగన్‌వాడీ ప్రాజెక్టు కార్యాలయాలు దూరంగా ఉండేవన్నారు. ప్రస్తుతం వీటిని నియోజకవర్గానికి తీసుకొచ్చారన్నారు. అన్ని రకాల సదుపాయాలు జగ్గంపేట సిడిపిఒ కార్యాలయంలో ఉంటాయన్నారు. కాకినాడ పిఒ ప్రవీణ మాట్లాడుతూ గతంలో కంటే మెరుగైన మెనూను ప్రభుత్వం గర్భిణులు అందిస్తుందన్నారు. జగ్గంపేట సిడిపిఒ పూర్ణిమ మాట్లాడుతూ కార్యాలయంలో చాలా వరకూ సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గ్రేడ్ వన్ సూపర్‌వైజర్ సునీత, సూపర్‌వైజర్లు అమ్మాజీ, పోచమ్మ, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.



జిజిహెచ్‌కు 78 యూనిట్ల రక్తం దానం

ప్రజాశక్తి-కాకినాడ

కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రి పారిశుధ్య, సెక్యూరిటీ కాంట్రాక్టర్ గోకెడ రాంబాబు కుమార్తె దివంగత స్వర్ణ భారతి జయంతి సందర్భంగా పలువురు మంగళవారం జిజిహెచ్‌కు 78 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. రక్తదాతలకు ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హేమలత దేవి, డిఎంఇంచార్జి డాక్టర్ రమేష్, ఆర్ఎంఒ రాహుల్ తదితరులు ధ్రువపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా శానిటేషన్, సెక్యూరిటీ సిబ్బందికి, 300 మంది రోగులకు ఉచితంగా భోజనాలు అందించారు. ఈ కార్యక్రమంలో గోకెడ రాంబాబు, ముమ్మిడి విష్ణు పాల్గొన్నారు.

సబ్సిడీపై టమాటా అందజేత

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

పెరుగుతున్న టమాటా రేటును దృష్టిలో పెట్టుకుని సబ్సిడీతో కేజీ రూ.50లకు టమాటాను అందిస్తున్నామని కాకినాడ మార్కెట్ కమిటీ చైర్మన్ పసుపులేటి వెంకటలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద ఉన్న రైతు బజార్‌లో ఏర్పాటు చేసిన సబ్సిడీ టమాటా విక్రయ కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రైతుబజార్ ఎస్టేట్ అధికారులు గోవిందరాజులు, శ్రీనివాస్, శివ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రోశయ్య జయంతి

ప్రజాశక్తి - యంత్రాంగం



రోశయ్య జయంతిలో పాల్గొన్న ఆర్యవైశ్య మహాసభ నాయకులు, సభ్యులు

ఉమ్మడి ఆంధ్ర రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య 90వ జయంతిని మంగళవారం జిల్లాలో పలుచోట్ల నిర్వహించారు. కాకినాడ కాకినాడ వైఎస్ఆర్‌సిపి పట్టణ అధ్యక్షుడు లింగం మల్లు కృష్ణమూర్తి ఆధ్వర్యంలో రోశయ్య జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు, ది గోదావరి ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రెసిడెంట్ పెద్ది రత్నాజీ మాట్లాడారు. రోశయ్య ఆంధ్ర రాజకీయాల్లో తనదైన ముద్ర వేశారన్నారు. ఆర్థిక మంత్రిగా 15 సార్లు రాష్ట్ర శాసనసభలో బడ్జెట్ ప్రవేశపెట్టిన ఒకే ఒక ఆర్థిక మంత్రి రోశయ్య అన్నారు. ఈ సందర్భంగా పేదలకు దుస్తులు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దంగేటి ప్రసాద్, వి.ఆనంద్, బాదం మధు, సిరి శ్రీనివాస్, సాయిరాం, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. గండేపల్లి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో రోశయ్య జయంతిని నిర్వహించారు. సంఘం మండల అధ్యక్షులు కొత్త చిన్నవీరభద్ర రావు ఆధ్వర్యంలో జడ్‌పి హైస్కూల్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 400 మంది పిల్లలకు నోట్ బుక్స్, పెన్నులు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. రాష్ట్ర అభివృద్ధికి రోశయ్య చేసిన కృషిని వివరించారు. ఆర్యవైశ్యులకు సంబంధించిన ఏ విషయమైనా వెంటనే స్పందించే వారిని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్యవైశ్య సంఘం వాలంటీర్ కమిటీ సభ్యులు సాయి, సంఘం నాయకులు మండపల్లి సుబ్బారావు, కోటేశ్వరరావు, ఎం.వెంకటరత్నం, వి.బాబ్జి, బత్తుల నానాజీ, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు. కాజులూరు లక్ష్మీ జ్యూయలర్స్ ప్రాంగణంలో రోశయ్య జయంతిని నిర్వహించారు. ఆర్యవైశ్య మండల అధ్యక్షులు వరదా శేషారావు, కార్యదర్శి బలభద్రుని మల్లేశ్వరరావు కార్యవర్గ సభ్యులు రోశయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వరద శేషారావు మాట్లాడుతూ రోశయ్య చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కె.రాజా, పి.సూర్యనారాయణమూర్తి, బి.శ్రీనుబాబు, కె.సీతారామ, ఎన్.శ్రీనివాస్, బి.నారాయణ పాల్గొన్నారు

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

ప్రజాశక్తి - ఆలమూరు



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న సత్యనారాయణరెడ్డి

కళాశాలలో చదివే ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకుని, ఉన్నత శిఖరాలకు చేరాలని జిల్లా ఇంటర్మీడియట్ బోర్డు అధికారి ఎస్ఏ.సత్యనారాయణరెడ్డి అన్నారు. ఆలమూరు శివారు కొత్తూరు సెంటర్లో గల ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఆయన సాధారణ తనిఖీలు నిర్వహించారు. ముందుగా ప్రిన్సిపల్ ప్రసాద్ రెడ్డితో కలిసి ఆయన కళాశాలలో తరగతి గదులను సందర్శించి, నూతన అడ్మిషన్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న అనేక సదుపాయాలను విద్యార్థులు వినియోగించుకుంటూ ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగాలన్నారు. పబ్లిక్ పరీక్షలలో మెరుగైన ఉత్తీర్ణత సాధించాలన్నారు. అలాగే కళాశాల అభివృద్ధి నిమిత్తం జరుగుతున్న నాడు - నేడు పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటుగా కళాశాల కమిటీ సభ్యులు సమకూర్చి అందజేసిన నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో అన్నదాతలకు కష్టాలు

ప్రజాశక్తి - కరప

జగన్ పాలనలో రైతులు నష్టాలు, అప్పుల్లో నిండా మునిగిపోయారని మాజీ ఎంఎల్ఎ పిల్లి అనంతలక్ష్మి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి పిల్లి సత్యనారాయణమూర్తి అన్నారు. వేములవాడ శివారు సిరిగుడిలో లంక గ్రామంలో భరోసాయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, కష్టాలను అడిగి తెలుసుకున్నారు. మేనిఫెస్టో కరపత్రాలను పంచి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి మాజీ సభ్యులు బుంగా సింహాద్రి, క్లస్టర్ ఇన్‌ఛార్జి పడాల జానకిరామయ్య, నాయకులు పెంకే దుర్గారావు, అనుసూరి శ్రీను, గుత్తుల నాగేశ్వరరావు, నాగం బాబులు, పాల్గొన్నారు.

పూడికతీత పనులు ప్రారంభం

ప్రజాశక్తి-ఆలమూరు

పెనికేరు గ్రామ శివారు ఒఎన్‌జిసి రిగ్ వద్ద నుండి గుమ్మిలేరు వరాల కాలువ వరకు సాగునీరు అందించే ప్రధాన పంట కాలువ పూడికతీత పనులను గ్రామ సర్పంచ్ వనం చిన్నావతి జార్జిబాబు ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభించారు. సుమారు రెండు కిలోమీటర్ల మేర ఉన్న ఈ పంట కాలువలో భారీ ప్రొక్లెయిన్ సహకారంతో పనులు చేపట్టారు. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామాన్ని ఆనుకుని ఉన్న పంట కాలువ కొన్ని దశాబ్దాలుగా 500 ఎకరాల పంట భూమికి సాగునీరు అందిస్తుందన్నారు. గత కొంతకాలంగా డంపింగ్ యార్డ్ నుండి కొడు కాలువ ద్వారా వస్తున్న చెత్త పేరుకుపోయి నీరు ముందుకు ప్రవహించకపోవడంతో రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రైతుల కోరిక మేరకు తమసొంత నిధులతో పనులు చేస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

ప్రజాశక్తి-మండపేట

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం దరిచేరి ఉంటుందని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి అన్నారు. మంగళవారం మండపేట పట్టణంలోని28వ వార్డులో కొన్నిలర్ మొండి భవాని మరళితో కలిసి రాణి పారిశుధ్య పనులను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ వర్షాకాలం దృష్టిలో ఉంచుకుని పట్టణ ప్రజలు పరిసరాల పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలన్నారు. దోమలు, క్రిమి కీటకాలు ప్రబలకుండా ఉండేందుకుగాను ఇంటి పరిసర ప్రాంతాల్లో నీరు నిలువలేకుండా చూసుకోవాలన్నారు. పారిశుధ్యంపై ప్రజల అభిప్రాయ సేకరణ చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ టి.రామ్ కుమార్, వైస్ చైర్‌పర్సన్ పిల్లి గణేశ్వరరావు, టౌన్ కన్వీనర్ ముమ్మిడివరపు బాబిరాజు, యరమాటి వెంకన్నబాబు, ఇన్‌స్పెక్టర్ లావణ్య తదితరులు పాల్గొన్నారు.

వైద్యం కోసం ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని గుమ్మిలేరుకు చెందిన రెడ్డి బుల్లబ్బు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్ గుణ్ణం రాంబాబు దాతల సహకారంతో పాటుగా తన వంతు సహాయాన్ని కలిపి రూ.20 వేలను మంగళవారం బాధితునికి అందించారు. అలాగే ఆ కుటుంబానికి అండగా నిలబడడానికి మరింత మంది దాతలు ముందుకు వచ్చి చేయూతని అందించాలని ఆయన కోరారు.

శరీర దృఢత్వానికి వ్యాయామం దోహదం

ప్రజాశక్తి-ఆత్రేయపురం

శరీర దృఢత్వానికి వ్యాయామం ఎంతగానో దోహదపడుతుందని ప్రముఖ ఫిజియోథెరపిస్ట్ అనుసూరి నరసింహమూర్తి అన్నారు మంగళవారం ఆయన లొల్లలో మెయిన్ పాఠశాల భవిత సెంటర్లో ప్రత్యేక ప్రతిభావంతులు గల వికలాంగులకు వ్యాయామం చేయించి తల్లిదండ్రులు వారిపట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించి వారితో ఎలా మెలగాలో తెలియజేశారు

టిడ్కో గృహాల అమ్మకాలు చెల్లవు

ప్రజాశక్తి-మండపేట

స్థానిక గొల్లపుంత కాలనీలోని టిడ్కో గృహాల అమ్మకాలు చెల్లుబాటు కాదని వాటిని అమ్మినా కొనుగోలు చేసినా చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ త్రివిక్ర రామ్‌కుమార్ అన్నారు. లావాదేవీలు జరిపిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామన్నారు. అంతేకాకుండా ఫ్లాట్స్ స్వాధీనం చేసుకుంటామన్నారు.

శానిటేషన్ పనుల తనిఖీ

ప్రజాశక్తి - కాకినాడ కార్పొరేషన్

నగరంలో 8వ వార్డులో జరుగుతున్న శానిటేషన్ పనులను అదనపు కమిషనర్ సిహెచ్.నాగనరసింహారావు మంగళవారం తనిఖీ చేశారు. కొన్నిచోట్ల చెత్త తొలగింపులో సిబ్బంది అలసత్వాన్ని గుర్తించారు. ఆయన మాట్లాడుతూ ప్రజలు తడి పొడి - చెత్తను వేర్వేరుగా ఇవ్వాలన్నారు. సేకరించిన చెత్తను విభజించి హూపర్ టిప్పర్ వాహనాల్లో తరలించాలని సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం కూడా చెత్త సేకరణ జరగాల్సిందేనని స్పష్టం చేశారు. ఆ దిశగా చెత్తను సేకరించే ఏజెన్సీకి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చామని, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు ఈ విషయంలో ప్రత్యేక బాధ్యత తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంహెచ్ఒ పృథ్వీచరణ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ టి.ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

ప్రజాశక్తి - తాళ్లరేవు

చొల్లంగి పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో 15 ఏళ్లుగా ఉన్న తాగునీటి సమస్యను పరిష్కరించామని ఎంఎల్ఎ పొన్నాడ సతీష్‌కుమార్ తెలిపారు. కాలనీలో రూ. 28 లక్షల సిఎస్ఆర్ నిధులతో నిర్మించిన వాటర్ ట్యాంకును ఆయన మంగళవారం ప్రారంభించి మాట్లాడారు. ఎన్నికల ముందు కాలనీ సందర్శించినప్పుడు ప్రజలు చెప్పిన సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఒక్కొక్కటిగా పరిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి రాయుడు సునీత, జడ్‌పిటిసి డి.సాగర్, ఎఎంసి చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, దున్న జనార్దనరావు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

జగన్‌తోనే ప్రజా సంక్షేమం

ప్రజాశక్తి - పెద్దాపురం

ప్రజా సంక్షేమం జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ దవులూరి దొరబాబు అన్నారు. మంగళవారం 3వ వార్డులో నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పార్టీలతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలకు అర్హులందరికీ అమలు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బొడ్డు తులసి మంగతాయారు, వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్, కనకాల మహాలక్ష్మి, మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర, గృహ సారథులు, కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.